జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను శనివారం కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి ఆవిష్కరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డైరెక్టర్, కో ఆర్డినేటర్లతో పోస్టర్ ఆవిష్కరించగా అనంతరం వారు మాట్లాడుతూ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌పై నిర్వహించనున్న సదస్సులో పలు అంశాలపై పరిశోధన ప్రచురణలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డీన్ రామసుబ్బారెడ్డి, సుజిత్, పార్థసారథి, దిలీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధిత పిల్లలకు అన్నదానం

ఘట్‌కేసర్: హెచ్‌పీసీఎల్ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని హెచ్‌పీసీఎల్ ఘట్‌కేసర్ శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధిత పిల్లలకు శనివారం అన్నదానం, సీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ శాఖ డీజీఎం రఘుపతి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధిత పిల్లలకు సహకారం అందించడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మోసెస్, నాగ అయ్యప్ప, లోహిత్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సమన్వయ కమిటీలు

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సమన్వయ కమిటీలను నియమించినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు, ఈ కమిటీలు ఎన్నికలు పూర్తయ్యే వరకు మాత్రమే చెల్లుతాయన్నారు. వివిధ పార్టీల నాయకుల చేరికలు, ఎన్నికల ప్రచారం వంటి కార్యక్రమాలను కమిటీలు సమన్వయం చేస్తారని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బండి రమేష్ (గత ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థి), కంటోన్మెంట్‌కు వెన్నెల(గత ఎన్నికల అభ్యర్థి), మల్కాజ్‌గిరికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, ఉప్పల్‌కు పరమేశ్వర్‌రెడ్డి(గత ఎన్నికల అభ్యర్థి), మేడ్చల్‌కు తోటకూర వజ్రేష్‌యాదవ్, జెడ్పీ చైర్మన్ శరత చంద్రారెడ్డితో కమిటీలను ఏర్పాటు చేశామని, కమిటీల్లో స్థానిక సీనియర్ నాయకులకు స్థానం కల్పించినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు రాష్ట్ర రాజకీయాల్లో మారిన పరిస్థితులతో కాంగ్రెస్ బలం పుంజుకోగా, దేశమంతా తమకు అనుకూలంగా ఉందని బీజేపీ సాగుతుండగా బీఆర్ఎస్ బలహీన పడిందో.. మౌనంగా ఉంటుందో అర్థం కాని పరిస్థితి మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో కనిపిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలలో ఎంత మంది తమ నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకుంటారో పట్టు కోల్పోతారో అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. -మేడ్చల్

ఎమ్మెల్యేలకు.. ఈ ఎన్నికలు

సవాలే..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో ఆరుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వారే..

ఈ ఎన్నికల్లో సత్తాచాటకుంటే వారి ప్రాబల్యం తగ్గినట్లే.. | ఆరుగురు ఎమ్మెల్యేలు మెజార్టీతో గెలిచిన వారే.. | పార్లమెంట్ ఎన్నికలలో తమ బలం చూపుతారా..?

కంటోన్మెంట్ ఎమ్మెల్యే కన్నుమూతతో ఉప ఎన్నికలు


కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు



మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి
ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద

అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే..

మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మేడ్చల్, కంటోన్మెంట్, కూకట్‌పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్ నియోజకవర్గాలు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించగా అక్కడ ఉప ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలతో కలిసి జరుగుతున్నాయి. మేడ్చల్ నుంచి మాజీ మంత్రి మల్లారెడ్డి 33,419 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై, కుత్బుల్లాపూర్ నుంచి వివేకానంద 85,576 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై, ఉప్పల్‌లో లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిపై 49,030 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మల్కాజ్‌గిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిపై 49,530 ఓట్ల మెజార్టీతో, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థిపై 70,387 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కంటోన్మెంట్‌లో దివగంత ఎమ్మెల్యే లాస్య నందిత బీజేపీ అభ్యర్థిపై 17,169 ఓట్ల మెజార్టీతో, ఎల్బీనగర్‌లో సుధీర్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిపై 22,305 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గెలిచిన ఏడుగురు బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారే. ఏడు నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలవగా కాంగ్రెస్ నాలుగింటిలో రెండవ స్థానంలో నిలిచింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పార్లమెంట్ ఎన్నికలు సవాలే..

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారాయి. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే నందిత మొదటిసారి ఎమ్మెల్యే కాగా ఆమె మరణించడంతో రాజశేఖర్‌రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం మాల్కాజ్‌గిరితో పాటు కంటోన్మెంట్‌ను అప్పగించింది. దీంతో రాజశేఖర్‌రెడ్డికి డబుల్ భారం కాగా, మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సీనియర్లు కావడంతో వారికి బాధ్యతలు ఎక్కు వగా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 30 నుంచి 40 వేల మెజార్టీ సాధించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తమ నియోజకవర్గాల నుంచి అంత మెజార్టీ తేవడం పెద్ద టాస్క్‌గా మారింది. బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడం , రాష్ట్రంలో ఆ పార్టీకి



బీజేపీ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను పోటీలో నిలపగా కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నాయకుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా పనిచేసిన సునీతారెడ్డిని రంగంలోకి దింపింది. రాజకీయంగా, ఆర్థికంగా చూస్తే బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి వీరికి ఎందులోనూ సరితూగే నాయకుడు కాదు. ఆయన ఇంతవరకు ఎలాంటి చట్టసభలకు ఎన్నిక కాలేదు. ఓ వైపు పార్టీకి ప్రతికూల వాతావరణం, మరోవైపు ప్రత్యర్థి పార్టీల నుంచి అగ్రనాయకులు పోటీలో ఉండటం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడం పెద్ద సవాల్‌గానే మారింది.

ప్రతికూల పరిస్థితులు ఉండటం, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలపై డేగకన్ను పెట్టి ఎక్కడ దొరుకుతారా.. వారిపై దాడులు చేయిద్దామా అన్నట్లుగా ఉండటం, ఇప్పటికే మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిల ఆస్తులను అక్రమాలు అంటూ కూల్చివేయడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో అధికార పార్టీ అంటే గుబులు పుట్టింది.

రెండుసార్లు కాంగ్రెస్.. ఒకసారి ఎన్డీయే మిత్రపక్షం..

మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు మూడుసార్లు ఎన్నికలు జరగ్గా రెండు సార్లు కాంగ్రెస్ ఒకసారి ఎన్డీయే మిత్రపక్షం అభ్యర్థులు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉండగా కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డి బరిలోకి దిగి ఎంపీగా విజయం సాధించారు.

బలపడుతున్న కాంగ్రెస్, బీజేపీలు

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అసెంబ్లీ ఎన్నికల వరకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ బలహీనపడుతోంది. ఆ పార్టీలో పనిచేసిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్లు, చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కొన్నిచోట్ల ప్రథమ శ్రేణి నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో, బీజేపీలో చేరుతుండటంతో చేరికలను ఎమ్మెల్యేలు ఆపకపోవడంతో ఆ పార్టీ ఎన్నికల నాటికి బలహీనంగా మారింది. కాంగ్రెస్ కార్పొరేటర్లను, కౌన్సిలర్‌లను, ప్రధాన నాయకులను పార్టీలో చేర్చుకుని బలం పెంచుకుంటోంది. బీజేపీ అదే తరహాలో చేరికలను ప్రోత్సహిస్తూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తుంది. మొత్తం మీద పార్లమెంట్ ఎన్నికలు మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారాయి.

రాగిడి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ టికెట్

మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ టికెట్ మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుమారుడు భద్రారెడ్డికి ఇవ్వాలని పట్టుబట్టి చివరి క్షణంలో తమ కుటుంబం ఎన్నికల్లో పోటీ చేయదని ప్రకటించి విరమించుకున్నారు. నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ టికెట్ ఆశించి వచ్చే పరిస్థితి లేదని కాంగ్రెస్‌లో చేరిపోయారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు పోటీకి ఆసక్తి చూపలేదు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఉప్పల్‌కు చెందిన నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించింది.

దేశంలో మూడోసారి అధికారం బీజేపీదే..


శిల్పా వెంచర్‌లో ఎన్నికల ప్రచారంలో చంద్రారెడ్డి తదితరులు

కీసర: దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం, ప్రధానమంత్రిగా మోదీ దేశానికి సేవ చేయడం ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని శిల్పానగర్‌లోగల పార్కులో శనివారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్న ప్రజలను కలిసి మేడ్చల్-మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమనాయకుడు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఈటల రాజేందర్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపించుకుంటే ఇక్కడి ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుంటుందన్నారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాగారం బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు నక్క కిషోర్, రాకేష్, జంగారెడ్డి, అక్కాల సురేష్, సూర్యశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నూతన కమిటీ

మేడ్చల్: మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ మైనార్టీ విభాగానికి నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌అలీ తెలిపారు. అధ్యక్షుడిగా ఆబేద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ యూసుఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ బషీర్, ఉపాధ్యక్షుడిగా లాయక్ అలీ, తాజ్, జుబేర్, జలీల్‌ఖాన్, జాయింట్ సెక్రటరీగా కమ్రుద్దీన్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు నూతన కార్యవర్గం ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిశారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డితో బీఆర్ఎస్ మైనారిటీ నూతన కార్యవర్గం

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కృష్ణారెడ్డి



శామీర్‌పేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శామీర్‌పేటకు చెందిన పలువురు నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేడ్చల్ జిల్లా నాయకులు కంటం కృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. వీరితో పాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం




మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో శనివారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు స్ఫూర్తి, జిక్రా, శ్రీపూజిత, సాహిష్ణ, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, లీలా గ్రామస్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పెద్దమ్మతల్లి కల్యాణం



శామీర్‌పేట్: పెద్దమ్మ తల్లి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. తూంకుంట మున్సిపాలిటీ ఉప్పర్‌పల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య పెద్దమ్మ తల్లి, పెద్దిరాజుల కల్యాణం వైభవంగా జరిగింది. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు, మహిళలు, భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు



కీసర: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారి భవిష్యత్తుకు పునాదులు వేసినప్పుడే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ -రాంపల్లి అకాడమిక్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమోద్‌శామ్ జోయిస్ అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన ఒరియెంటేషన్, పేరెంట్స్‌డే వేడుకల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ కృషి చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుచరితరాయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభ, కళల పట్ల వారికి ఉన్న ఆసక్తిని వెలికి తీసేందుకు పేరెంట్స్ డే చక్కని వేదిక అన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి


కొర్రెముల్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ఘట్‌కేసర్: కొర్రెముల్ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్ అధ్యక్షతన సంస్థ ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర సదుపాయాలపై చర్చించారు. విశ్రాంత ఉద్యోగులకు హైదరాబాద్‌లోనే నెలవారీ మందులు పంపిణీ చేయాలన్న ప్రతిపాదనకు సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. భవిష్యత్‌లో విశ్రాంత ఉద్యోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సింగరేణి సంస్థ ప్రతినిధులను విశ్రాంత ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్, బస్వయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, మల్లయ్య, నాగేశ్వర్‌రావు, ప్రకాశ్‌రావు, టీ.శ్రీనివాస్, సర్జిత్‌సింగ్, సత్యనారాయణ, ప్రతాపసింగ్, మీరా ప్రసాద్, అరుణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత బీజేపీకి మద్దతుగా నిలవాలి

మేడ్చల్‌రూరల్: యువత ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కార్ ముందుకు సాగుతోందని, వచ్చే ఎన్నికల్లో యువత ప్రధాని మోదీ పాలనకు, బీజేపీకి మద్దతుగా నిలవాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు ఈటల క్షమిత అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ చౌపల్ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు బట్టికాడి విక్రమ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ తన నీతివంతమైన పాలనకు యువత అండగా నిలవాలన్నారు. దేశ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, యువత భవిష్యత్‌కు బాటలు వేశారని తెలిపారు. మరోమారు బీజేపీకి అవకాశం కల్పించాలని, యువ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, బీజేవైఎం నాయకులు కావేరి శ్రీధర్, నవీన్, అశోక్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈటల క్షమిత

గ్రామాల్లో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కీసర: మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో శనివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగాలంటే ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న పట్నం సునీతామహేందర్‌రెడ్డికే ఓట్లు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సింగారం నారాయణ, మహేష్, సత్తిరెడ్డి, దయానందర్‌గౌడ్, శివలింగాల శ్రీనివాస్‌గౌడ్, సుంకరి జైహిందర్‌రెడ్డి, మంచాల ప్రవీణ్ కుమార్, ముద్దం వెంకట్, బలరాం, బాలరాజ్, లింగేష్, వంశీ, నాగేష్, రమేష్, రాధాకృష్ణ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.


అంకిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

కాంగ్రెస్‌లోకి నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్

కీసర: నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, నాగారం మున్సిపల్ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజు సుమిత్రసురేష్, మాజీ ఎంపీపీ మాదిరెడ్డి స్వప్న, మాజీ జెడ్పీటీసీ బండారు రమాదేవి, పీఏసీఎస్ డైరెక్టర్ మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ అనురాధయాదగిరిగౌడ్, మాజీ వార్డు సభ్యులు దుర్గచారి, సంతోష్, బీఆర్ఎస్ నేతలు మణికంఠ, భాను తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు